కథ

# బతుకు భయం

## – వెల్చేరు చంద్రశేఖర్

తుపాను గాలికి తాటాకులు శబ్దం చేస్తున్నాయి. తాటాకుల కప్ప కన్నాల్లోంచి చిన్న చిన్నగా నీటి బొట్లు టప్..టప్..మని రాలుతున్నాయి. నీటిబొట్లు నేల మీద పడకుండా, అవి పడే చోట ఇనప బాల్చీ, రెండు సిల్వరు గిన్నెలూ వున్నాయి. పాకలో ఓ మూలగా కిరసనాయిలు బుడ్డి దీపం దగ్గర పెట్టుకుని ఇనప గొట్టంతో పొయ్యి వూదుతోంది పోలమ్మ. ఈదురు గాలికి పొయ్యి సరిగ్గా రాజుకోడం లేదు. పక్కనున్న బల్ల తీసి పొయ్యికి అడ్డు పెట్టింది. గాలి తాకిడి తగ్గింది. పొయ్యి రాజుకుంటోంది. పాకలో ఇంకో మూలన గోడకానుకుని కూర్చున్న కొండడు జేబులోంచి చుట్ట తీసి, వెనక పక్కగా చిన్నగా కొరికి, బైటకి వుమ్మేశాడు. కొరికిన వైపు నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్లతో చుట్ట అంటించడానికి రెండు సార్లుగీశాడు అగ్గిపుల్ల. అది వెలిగినా గాలికి ఆరిపోయింది.

"పోలీ అగ్గి రవ్వెట్టుకు రావే చుట్టెలగట్లా" అన్నాడు.

"నేనిక్కడ ముద్దుడక బెట్టడానికి మంటెట్టలేక చస్తోంటే, మద్దిన నీ సుట్ట వైబోగం ఏంటి? ఈడ కొచ్చి ఎనిగించుకో నేవూ" అంటూ దీర్ఘం తీసింది పోలమ్మ.

"సర్లే. పొయ్యి కాడకే వత్తున్నా. యెచ్చగా వుంటది" అంటూ కూర్చున్న చోటు నుంచి లేచి, పొయ్యి దగ్గరికి వెళ్ళి, పోలమ్మ ఎదురుగా పొయ్యికి పక్కగా చతికిలబడ్డాడు. పోలమ్మ పొయ్యి లోంచి కొరకంచు తీసి చుట్టంటించింది. తిరిగి కొరకంచు పొయ్యిలోకి తోసింది. అక్కడే స్థిరపడి పోయాడు కొండడు.

"ఈ ముసురు ఎన్నాళ్ళుంట?" అనడిగాడు కొండడు.

"మూడ్రోజులేనా యుంటుంది. ఈ యేళేగా మొదలయింది. రేడియాలో చెప్పిండంటగా రేవు సాయంకాలానికి గాని తీరం దాటద్దంట! అందుకే ఈ మధ్యాహ్నం నించీ గాలెక్కువైంది. వానా ఎక్కువైంది. ఈ ఏళే కొంప కార్తోంది. మరి రేపేటవుద్దో!" అంటూ విచారం వెలిబుచ్చింది పోలమ్మ.

"ఏమవదులే. మొన్నట్టుకొచ్చిన రబ్బరు గుడ్డలు, రేవు పాకమీదేస్తాను" అన్నాడు కొండడు.

"ఏంటి ఆ పెంట కుప్ప మీంచి అట్టుకొచ్చిన గుడ్డలేనా? అవెక్కడ ఆగుతయి, ఆగవు" అంది పోలమ్మ.

చిన్న పిల్లల పాత్తిళ్ళలో వేసి, చిరిగిపోయి బైట పారేసిన రబ్బరు గుడ్డల్ని పాక కన్నాల్లో వేసి కప్పడానికి తెచ్చాడు కొండడు. తెచ్చిన్నాడు సణుక్కుంది పోలమ్మ. కాని ఇప్పుడు అవే పనికి వస్తాయని తెలిసి గమ్మున వూరుకుంది.

గాలికి కిరసనాయిలు దీపం 'రాక్ అండ్ రోల్' నృత్యం చేస్తోంది. వెలుగు నీడలు పాకలో వస్తువుల మీద పడి వింత భయాన్ని గొలువుతున్నాయి. ఆ వెలుగు నీడల దోబూచులాటలో పాకలో ఓ మూలగా వున్న పెద్ద గంపని చూశాడు కొండడు.

"పోలీ కూరలు తెచ్చావేంటే?" అన్నాడు.

"ఆ పొద్దున్నే సంతకెళ్ళి కూరలట్టుకొచ్చినా, పొద్దున్నే విశాక పట్నానికి తుపానెళ్ళుద్దని కబురు తెలిసి, సేను కట్ట గుండా సంతలోకెళ్ళి నాలుగు కిలోలొంకాయలు, మూడు కిలోల దొండ కాయిలు, రెండు కిలోల బంగాలా దుంపలు, పది అరటి కాయలు.." అంటూ పోలమ్మ చెప్తకుపోతుంది.

కొండడు పోలమ్మ మాటలకి అడ్డొచ్చి "ఏటి దినవారా లెట్టడానికా ఈ కూరలన్నీ" అన్నాడు.

"నీకేం అట్టూ కట్టుగా వున్నావు. నీ దినవారాలకేటి తొందరొచ్చింది గానీ రేవు మురలీ నగరం ఎల్లి ఒక్క తిరుగు తిరిగానంటే బుట్ట కాళీ అయిపోదూ" అంది.

"ఏంటి! ఇంత ముసురులో బుట్టట్టుకుని మురలీ నగరం యెల్తావా? నీకేమైనా మతుందా?" అన్నాడు కొండడు ఆశ్చర్యంగా.

"మతుంది కాబట్టే తొందరడ్డాను. రెండు మూడ్రోజుల వరకూ కాలనీలో వాళ్ళెవ్వరూ ఎక్కడికీ కదన్నేరు. ఆళ్ళ కాడకేదొస్తే అది కొనేస్తారు. అసలు మామూలు రోజుల్లోనే అళ్ళెక్కడికీ కదన్రు. ఆడ ఆడోళ్ళుంటరు.ఇంక ఈ ముసుర్లో ఎక్కడ కెళ్తరు? ఈళ్ళెళ్ళినా కూర్నేటి దొరుకుతయి"

"పోలీ బయపడుతున్నావేమో, ఇన్నేసి కూరలు కొన్నావు, ఈ ముసురులో కూరలు తడిసి, ఎలాగూ ఎండవు. ఆళ్ళూ కొనకపోతే, నాబం గూబల్లోకొచ్చి, మొత్తం సొమ్మంతా సింహాద్రప్పన్న పరం అయిపోవు గదా!" అన్నాడు కొండడు నవ్వుతూ. కాని ఆ నవ్వులో హాస్యం కన్నా పోలమ్మ చేసిన తెలివి తక్కువ పని మీద జాలే ఎక్కువుంది.

"నువ్వేటి అలాగంటవు. రెండేళ్ళ నుంచీ మురలీ నగరంలో నే కూరనమ్మటం తే? ఏటి? మురలీ నగరం ముంగిట వుంటాడు చూడూ లాయరు బాబు! ఆళ్ళింటికెళ్తే ఆయమ్మ గారికి వంకాయిలు పేనం. కిలోకి తక్కువ కొన్దు. నేనా వంకాయలు అయిదేసి సొప్పున వుచ్చుకున్నానా? పదికేనా అమ్మక పోను. ఆ పక్కగా ఇంజనీరు గారున్నారు సూడూ! నే కూరలట్టుకెళ్ళగానే ఆవిడతో పాటు ఆయనా వొచ్చేస్తాడు. బొజ్జ కిందకి లుంగీ వుంటుందా? వూడుద్దా? అన్నట్టుంటది. ఆ బాబుకి ఈ ముసుర్లు, వానలు వస్తే పండగ. పన్లోకెళ్ళక్కర నేదు. ఆ బాబు బైటకి వస్తుంటే కోటిగాడి సారా కొట్టు వదిచి వచ్చేస్తున్నట్టుంటది. ఆ బాబుకి బజ్జీలవసరం. అరటి కాయలు, బంగాళా దుంపలు చూస్తే వదల్డు! ఆ పక్కగా గుమస్తా బాబున్నాడా! ఆయనకి వూరంత బయం, గట్టిగా ఎండ కాస్తే బయం. వానొస్తే బయం. గుంటలు స్కూలుకెళ్తే బయం. ఇంటో కూకుంటే బయం, కూరల దానికి ఎక్కువ డబ్బు పోసి పెళ్ళాం కూరలు కొంటుం దేమో అని బయం. బజారు కెళ్ళి కూరలు తెచ్చుకుంటే స్కూటరుకి పెట్రోలయిపోద్దని బయం. చల్లపెట్టె లోవి తింటే పడిసెం బయం. బయట వదినేస్తే కుళ్ళిపోతాయని బయం. ఖూరల్ది రాకపోతే బయం. వస్తే ఎక్కువ దరలు సెప్తుందేమో అన్న బయం. కాని ఎంత దరేనా పెట్టి ఆ అమ్మ కొనక మాన్దు. ఆ పక్కగా ఆఫీసరు గారి పెళ్ళాం వుంది సూసావూ! ఆయమ్మ యమ డేంజరు.ఓ పట్టాన బేరం తేల్చదు. మనల్ని తట్టెత్తుకు పోనివ్వదు. అర కిలో వొంకాయలు కొని, పావు కిలో వంకాయలు కొసరేయించుకుంటది. అందుకే ఆయమ్మ దగ్గర జాగ్రత్తగా వుండాల. తూసేటప్పుడు, తాసు కడ్డీ కాడ సెయ్యెట్టి, తక్కువ తూసాల. తర్వాతో రెండు కాయలెయ్యాల. అది ఆయమ్మకి సంతృప్తి. ఆయమ్మ దగ్గర మాత్రం జాగ్రత్తగుండాల. మన కన్ను మరుగయిందో, మనం సూడకుండా బుట్ట లోంచి నిమ్మకాయో, పచ్చిమిరప కాయలో, అల్లం ముక్కో మాయం సేసే సేతివాటం వుంది" ,అంది పోలమ్మ ఆయాసం తీర్చుకుంటూ, పొయ్యిలో నెగడు ఎగదోసింది.

"నీదగ్గరెవ్వడేనా కొట్టేసిందేటే"



"ఆ! ఆయమ్మ గార్ని మంచి నీళ్ళడిగివా, మంచి నీళ్ళిచ్చింది, వేవరుగు మీద మంచి నీళ్ళు తాగ తావుంటే, వో నిమ్మకాయ తీసి దాచేసింది. ఆ యింటి నుండి ఇంకో ఇంటికెళ్ళి నూద్దునా! మూడు నిమ్మకాయలకీ తట్టలో రెండే వున్నాయి".

"ఈళ్ళందర్నీ వొడకట్టేసేవన్నమాట. అయినా అంత డబ్బుండీ ఆ బుద్దులేటే!" అన్నాడు కొండడు విచారంగా.

"మామూలు రోజుల్లో కూరలట్టుకెళ్ళి మధ్యాహ్నం వరకూ తిరిగి అమ్మితే వంద రూపాయల వరకూ అమ్ముడవుతాయి. అందులో గిట్టుబాటు ముప్పై రూపాయిలుండచ్చు. రేవు నీకు కూలి ఎవాగూ వుండదు. అది కూడా గిట్టుబాటవాలంటే వానో, తుపానో! కూరల బుట్టొట్టుకు పోడమే" అంది పోలమ్మ తవ ముందాలోచనకి తానే మురిసి పోతూ.

నిజమే అనిపించింది కొండడికి. పోలమ్మ తన కష్టానికి తోడుండబట్టి ఈ చిన్న పాక వేశాడు. ఉండడానికి పైకప్పు దొరికింది. నాలుగేళ్ళ క్రితం ఏ రోజు వచ్చిన డబ్బులు ఆరోజు బియ్యం కొని రైల్వే స్టేషను పక్కగా నాలుగు రాళ్ళు పోగేసి పొయ్యి చేసి వండుకు తినేవాడు. పోలమ్మ తగిలిన దగ్గర్నించీ, ఇద్దరి సంపాదనా పెరిగినా, పాకేసుకు నేంతగా డబ్బు చేరలేదు. రైల్వే స్టేషను పక్కగా ప్రహరీ గోడకి ప్లాస్టిక్ షీట్ కట్టి దానికిందే ఏడాది గడిపారు. పోలమ్మ కూరలమ్మడం మొదలెట్టేక రోజూ ఎంతో కొంత రాబడి వుంటూ వస్తోంది. దాంతో టౌనుకి దూరంగా సింహాచలం వెళ్ళే దారిలో, చాలా మంది కూలీలతో కలిసి వో చిన్న పాక వేశారు. పోలమ్మకి ఆలోచన ఎక్కువ. అందుకే రెండు రోజులు ముసురుండని తెలిసి ఎక్కువ కూరలు తెచ్చింది. రోజూ సంపాదించే ముప్ఫయి నలభయి రూపాయలకి బదులు అరవై డెబ్బై రూపాయలు కిట్టొచ్చు. ఈ ముసురులో తనకి కూలి ఎలాగూ వుండదు. అది కూడా కూరలమ్మి కిట్టిద్దామని పోలమ్మ ఉద్దేశం. అసలు ఇన్ని కూరలు కొనటానికి పోలమ్మకి సొమ్ము ఎక్కడిదో! ఆ అనుమానం రాగానే-

"పోలీ కూరలకు సొమ్మెక్కడిదే" అనడిగాడు.

"సింహాద్రప్పన్న ముడుపు వాడుకున్నా. మళ్ళీ సాయంకాలం కట్టేస్తాలే"అంది పోలమ్మ.

"దైవ సహాయం అంటే అదే గావాల్ను. మన డబ్బు మనకిచ్చి సాయం సేస్తాండు. అప్పన్న రేవు కూరలు అళ్ళ సేత కొనిపించేసి సాయం సేస్తే బావుణ్ను" అన్నాడు కొండడు.

"అప్పన్న సామ్మేగా! కూరలు కొనిపించేస్తాడులే!" అంది పోలమ్మ నవ్వుతూ.

పొయ్యి తగ్గించింది పొయ్యి తగ్గేసరికి, ఈదురు గాలికి చలి వేసింది పోలమ్మకి.

"ఏదీ సుట్టియ్యి" అంటూ కొండడి వేపు చెయ్యి చాచింది. సగం వరకూ కాలిన చుట్టని పోలమ్మ కిచ్చాడు కొండడు. చుట్టని నిప్పవైపు వేపు నోట్లో పెట్టుకుంది పోలమ్మ.

"అడ్డపొగొద్దని ఆస్పత్రిలో పెద్ద కాగితం పెట్టారు సూడ్లేదేటే, కేన్సరో, బోన్సరో ఒస్తుందట!" అన్నాడు కొండడు చిరాగ్గా. చుట్ట పొగలోంచి కొండడ్ని విచిత్రంగా చూసి పొయ్యి మీంచి సిల్వరు గిన్నె దించింది పోలమ్మ.

*** *** ***

తుపాను గాలి మనిషిని నిలబడనివ్వడం లేదు. నెత్తి మీద తట్టని పెట్టుకుని నడవటం కష్టంగా వుంది. తట్ట లోంచి చిన్న చిన్న నీటి బొట్లు ఒంటి మీద పడి ఒళ్ళంతా తడిసింది. ఒకసారి కాలనీ అంతా తిరిగింది. అందరూ ఖరీదు ఎక్కువ అన్న వాళ్ళే, కాని ఏరి ఏరి కొనేసుకున్నారు. రెండోసారి మళ్ళీ కాలనీకి మరో పక్కగా వెళ్ళింది. రెండో సారి తిరుగుతున్నప్పుడు కొనేవాళ్ళకి, బేరమాడే అవకాశం ఇచ్చింది. దాంతో మొదటి సారి కన్నా ఎక్కువగా అమ్ముడుపోయాయి. మూడోసారి తిరుగుతూ తెలిసిన వాళ్ళ గడప ఎక్కి, కూరలు కావాలా! అనడిగింది. అందులో గుమస్తా గడప కూడా వుంది.

"ఏమిటీ! అరటికాయ రెండు రూపాయిలా?" అంది గుమస్తా పెళ్ళాం.

"అవునమ్మా. తుపానుకి మార్కెట్లో రేటు పెంచేశారు. మాదేముంది అడ కొంటాం. వో పావలా యేసుకుని అమ్ముతాం. ఇలాంటి తుపాన్లో కూరలు తేవడమే కంట్టం" అంది పోలమ్మ.

"ఎందుకూ! అంత ఖరీదు పెట్టి కొనడం? రెండు రోజులు ఫ్రిజ్‌లో వున్న వాటితో జరుగు బాటు చెయ్యి" అన్నాడు వెవగ్గా వచ్చిన గుమాస్తా.

"ఏొకళ్ళా, ఇద్దరా? ఎంతమందికని జరుగుబాటు చెయ్యడం? ఈ తుపాను తగ్గి మీ బద్ధకం తీరి, బజారుకెళ్ళే సరికి చాల రోజులవుతుంది. ఫ్రిజ్‌లో వున్నవి ఎందుకూ చాలవు. ఏదో కూర తీసు కుంటే సరి. బజార్లో అయినా వొకటో, రెండో రూపాయలు తక్కువ వుంటుంది. ఎలాగూ గుమ్మంలోకి వచ్చాయి కదా" అంటూ లోపలికెళ్ళి నాలుగు అరటి కాయలు తీసుకుంది గుమాస్తా పెళ్ళాం.

రూపాయి అరటి కాయని రెండు రూపాయలకి కొన్నందుకు గుమాస్తాకి చిరాకేసింది. మాటిమా టికీ 'మీకు బద్ధకం' అని పెళ్ళాం అనేసరికి కోపం వచ్చింది. ఆ ముసురులో గొడుగేసు కుని, బజారుకి బయలుదేరాడు. బజార్లో కూరలు తక్కువగా వున్నాయి. కొనే వాళ్ళు తక్కువగా వున్నారు. ఇంటి దగ్గర కొచ్చిన కూరల మనిషి చెప్పిన ధరకన్నా రూపాయి, రెండు తక్కువగా వున్నాయి.

కూరల సంచీతోనూ, బలంగా వీస్తున్న గాలికి ఎగిరిపోతున్న గొడుగుతోనూ, పడుతున్న వాన తోనూ సమన్వయం కుదరక మోకాళ్ళ లోంతులు తడిసి, నాలుగు కూరలు పట్టుకొచ్చాడు గుమాస్తా.

"బజార్లో కూడా కూరలు తక్కువ వున్నాయి. కాని కూరల్ది ఇచ్చిన ధర కన్నా తక్కువే. వంకా యలు కూరల్ది పది రూపాయలు చెప్పింది. బజార్లో ఎనిమిదికే ఇచ్చాడు" అన్నాడు గుమాస్తా గర్వంగా, పొడి బట్టల్లోకి మారుతూ.

"వర్షంలో తడుస్తూ ఇంటింటికీ తిరిగి అమ్ముకు నేది ఆమాత్రం రూపాయో, రెండో వేసుకోకుండా వుంటుందా?" అంది అతడి పెళ్ళాం. అంతే గాని గుమాస్తా తుపానులో చేసిన సాహసాన్ని మాత్రం మెచ్చుకోలేదు.



## లైలా మాయాజాలం!

ఈమధ్య తెలుగు సినిమాల్లో మాయమైన లైలా ఏం చేస్తుందా? అని కూపీ లాగితే ముంబయ్‌లో రాజ్‌కుమార్ సంతోషిని కాకా పడుతోందని తెలిసింది. అలా దువ్వగా దువ్వగా రాజ్‌కుమార్ తాను షారూక్‌ఖాన్, అమీర్ ఖాన్‌లు హీరోలుగా తీయబోయే సినిమాలో అవకాశం ఇచ్చాను. కానీ మమతా కులకర్ణి లాగా, ఒళ్లు దాచుకోకుండా పనిచేయాలని కండిషన్ పెట్టాడట.

తనని మెచ్చుకోకపోగా, కూరల్నాన్ని సమర్ధించి నందుకు గుమాస్తాకి కోపం వచ్చింది.

'వీళ్ళకి అర్ధం కాదు. బజార్లో ఎనిమిదికి వస్తున్న వస్తువుని పది పెట్టి ఇంటి దగ్గర కొనటం ఎందుకో?' అని సణుక్కున్నాడు.

*** *** ***

సాయంకాలానికి గుమాస్తాకి తుమ్ములు మొద లయ్యాయి. రాత్రి జ్వరం వచ్చింది. అర్ధరాత్రికి నిద్రలో పిల్లి కూతలు మొదలు పెట్టాడు. ఆమె జడిసిపోయింది. పక్కింటి కెళ్ళి ఇంజినీరు గార్ని పిలిచింది. ఆయన వచ్చి ఎగవూపిరి వస్తున్న గుమాస్తాని చూసి "ఆస్మాటిక్ ఎటాక్' అంటూ తనింటికెళ్ళి అక్కడ నుంచి అంబులెన్స్‌కి ఫోన్ చేశాడు. ఆస్పత్రి నుంచి అంబులెన్స్ వచ్చింది. తెల్లారేసరికి అతడు ఆస్పత్రిలోనే వున్నాడు.

డాక్టర్ల కృషి ఫలితంగా రెండు రోజుల్లో నెమ్మదిం చింది గుమాస్తాకి. అలా నెమ్మదించడం మొదలు మళ్ళీ పెళ్ళాన్ని సతాయించడం ప్రారంభించాడు. "మందులు, టెస్టులకయిన ఖర్చులు, డాక్టరు, ఆస్ప త్రికయిన ఖర్చంతా చూపించే బిల్లులు సిద్ధం చేయి" అంటూ పదే పదే హెచ్చరించడం మొద లుపెట్టాడు.

అతని భయం ఆ డబ్బు అనవసరంగా ఖర్చు చేశావని. తన ఆరోగ్యానికి బాధ్యత ప్రభుత్వానిదే నని అతని ఆలోచన. అంతే కాదు. తనని, తన సీనియారిటీని గుర్తించి ప్రమోషన్ ఇవ్వటం, ధరలు పెరిగితే దానివల్ల తనకి ఏవిధమైన కష్టమూ కలగ కుండా డి.ఎ. పెంచడం, తన వినోదం కోసం లీవ్ ట్రావెల్ కన్సెషన్ ఇవ్వడం, తన జబ్బుకయిన ఖర్చు అంతా భరించి తనని ఆరోగ్యవంతుణ్ణి చేయడం మొదలైన వాటన్నింటికీ ప్రభుత్వమే బాధ్యురాలని అతని గట్టి నమ్మకం.

తుపాను తగ్గాక అతని కొలీగ్స్ కొందరు, బంధువులు కొందరు ప్రభుత్వాస్పత్రికి వచ్చి అత డిని చూశారు.

"ఏమిటోయ్! ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో జాయి నవ్వలేక పోయావా?" అనడిగిన దానికి సమాధా నంగా—

"అక్కడ రిఎంబర్స్‌మెంటు వుండదు, ఇక్కడ ఇచ్చిన బిల్స్ మాత్రమే చెల్లుతాయి" అన్నాడు గుమాస్తా.

వారం రోజులకి గుమాస్తాకి నెమ్మదించింది. మర్నాడు డిశ్చార్జి అవుతాడనగా, మెడికల్ ఆఫీసర్ దగ్గర డిస్చార్జ్ సర్టిఫికెట్ తీసుకోవడానికి వెళ్ళింది అతడి పెళ్ళాం. సర్టిఫికేట్ తెచ్చుకుంటూ, రోగు లున్న వార్డు లోంచి నడుస్తుండగా తెలిసున్న మొహం కన్పించింది. ఎవరా? అని పరికించి చూసింది. బెడ్‌లకి పక్కగా కిందనే ఓ బెడ్ వేసి వుంది. దాని మీద ఎముకలకి చర్మం అంటిరచినట్టుగా, కళ్ళు లోతుకి పోయి, చింపిరి

జుత్తుతో గోడకి దిండు పెట్టుకొని, దానికి ఆనుకుని కూర్చుంది కూరలమ్మే మనిషి పోలమ్మ.

"నీకేమయిందే?" అవడిగింది ఆశ్చర్యంగా.

"వర్షంలో రెండు రోజులు తడుస్తూ, కూరల మ్మేనమ్మగారూ! నిమోనియా జ్వరమంట. పండబె ట్టేసింది" అంది పోలమ్మ నీరసంగా.

"ఇప్పుడెలా వుంది?" అవడిగింది సానుభూతిగా ఆమె.

"తగ్గే సూచనలు ఏవీ కనపడటం లేదమ్మా. రాత్రయేసరికి వణుకూ, జ్వరం వచ్చేస్తున్నాయి" అంది పోలమ్మ దీనంగా.

ఆమెకు దాన్నెలా ఓదార్చాలో తెలియలేదు. అక్క డ్నించి కదిలి వెళ్ళిపోయింది.

*** *** ***


పోలమ్మ ఆలోచనలు పూర్తిగా పారలేదు. కూర లన్నీ ఒకేరోజు అమ్ముడు పోలేదు. రెండో రోజు కూడా కాస్త ఎక్కువగా తిరిగి వర్షంలో తడుస్తూ కూరలన్నీ అమ్మేసింది. ఆ అలసట వల్ల, వర్షంలో తడవడం వల్ల ఆ రాత్రికి జ్వరం వచ్చేసింది. రెండు రోజులూ తుపాను వల్ల కొండడు పనిలోకెళ్ళలేదు. చుట్టలు కాలుస్తూ పాకలోనే కూర్చున్నాడు. జ్వరం వచ్చిన్నాడు రాత్రి కషాయాలవతో కాలం గడిపింది పోలమ్మ. కాని జ్వరం తగ్గిన సూచనలేవీ కనపడ లేదు. మర్నాడు తెరిపిచ్చాక కొండడు మునిసిపల్ ఆస్పత్రికెళ్ళి మాత్రలు పట్టుకొచ్చి మింగించి, కూలికి వెళ్ళిపోయాడు.

సాయంకాలం కూలి నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి, పోలమ్మ పక్క మీద ఎగ వూపిరితో అవస్థ పడుతోంది. పక్కలు ఎగిరెగిరి పడుతు న్నాయి. ఏం చేయడానికీ తోచక అతి కష్టం మీద తీసుకొచ్చాడు కొండడు.

పోలమ్మ ఆస్పత్రి లో జాయినయింది. డాక్టర్లు ఆమె జబ్బును 'న్యూమోనియా' అన్నారు. నాలుగు రోజులు ఆస్పత్రిలో వున్న తర్వాత పోలమ్మకి ఎగ వూపిరి తగ్గింది కాని జ్వరం తగ్గలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ కొండడి రాకపోకలు తగ్గిపోయాయి. రోజూ సాయంకాలం వచ్చేవాడు. నాలుగు రోజుల కొకసారి, వారం రోజుల కొక సారి వస్తున్నాడు. వచ్చినప్పుడు పోలమ్మ చేతిలో అయిదో పదో పెడ్తున్నాడు. పోలమ్మకి నెమ్మదించే సరికి, ఆలోచనలు బతుకు మీదకి పోయాయి. 'రేపేమిటి?' అని ఆలోచిస్తోంది. కొండడు పాకలోకి ఎవర్తినేనా తెచ్చి పెట్టేడా? తన గతి ఏమిటి? తను సంపాదిస్తోంది అంటేనే కొండడికి తనంటే ఇష్టం వుంటుంది. ఈ జబ్బు తర్వాత తనకి ఇంటింటికీ తిరిగి కూరలమ్మే సత్తువుం టుందా? ఇంతకు ముందు ఎన్ని సార్లు వర్షంలో తడవలేదు తను? మరిప్పుడు ఆస్పత్రిపాలయ్యింది. తన ఆరోగ్యం పాడయిందనేమో? తనకి వయసు అయిపోయిందా?

ఆకలంటే భయం లేదు. ఆకలికి అంతకు ముందూ భయపడలేదు. ఇప్పుడూ భయం లేదు. ఒంట్లో సత్తువ వున్నన్నాళ్ళూ ఏ ఇంట్లో అయినా పాచి పని చేసుకు బతికేస్తుంది. నాలుగేళ్ళుగా ఒడ్డున పడ్డ జీవితం మళ్ళీ పొందిక లేకుండా పోతుందా? తను కొండడితో కష్టపడి కట్టు కున్న పాక, తన ప్రయత్నం నిష్ఫలమైపోతుందా? తను అటు సంతలోనూ, ఇటు కాలనీలో కూర లమ్మి సంపాదిస్తుందే? కొండడికి తనంటే ఇష్టం వుండదా? బతుకులో పొంచి వున్న అపాయానికి పోలమ్మ భయపడుతోంది. ఈ అపాయంలో ఆదుకుని పూచీ పడేవాళ్ళెవరు?! ఈ జీవితా నికి పూచీ పడే వాళ్ళెవరు? అందుకే భయం. ఆకలికి, దరిద్రానికి భయం లేదు. దేవుడిచ్చిన రెక్కలు ఆడుతున్నన్నాళ్ళూ వీటికి భయం లేదు. కాని భయమల్లా కొండడికి కూడా సరిపోయేటట్టు సంపాదించగలనా? లేదా? అనే. అదీ భయం. రెక్కల్లో, ఒంట్లో సత్తువణిగి, రెక్కలు చచ్చుబడి పోతే అప్పుడేమిటి? ఎవరు పూచీ వహిస్తారు? అదీ భయం!

ఆస్పత్రి సిబ్బంది "రొట్టె..రొట్టె.." అంటూ అరుస్తూ ప్రతి బెడ్ దగ్గరకూ వచ్చి పంచుతు న్నారు. కానీ పోలమ్మకి ఏమీ వినపడటం లేదు



**దర్శకుల కాంట్రవర్సీ**

తనకు తెలిసినంతలో ఎక్కువమంది ప్రతిభ కల్గిన దర్శకులు తమిళంలోనే ఉన్నారని ప్రముఖ దర్శకుడు మణిరత్నం అంటూంటే, తమిళంలో వచ్చే క్రొత్త దర్శకులంతా ఒక్క చిత్రానికే తప్ప ఆ తరువాతి చిత్రాల్లో తమ క్రియే టివిటీని చూపించలేక తెరమరుగవుతున్నారనీ మన తెలుగు టాప్ డైరెక్టర్ ఇవివి సత్యనా రాయణ అంటున్నారు. ఇదేదో కాంట్రవర్సీకి దారితీసేలాగా ఉందే?


**రూ. 2,50,000/- విలువైన బహుమతులు గెలుపొందండి**

| | | |
|---|---|---|
| 10 | | |
| | 11 | |
| | | 12 |

ప్రత్యేక బహుమతి: హీరోహోండా మోటార్ సైకిల్ లేదా చేతక్ స్కూటర్ లేదా కలర్ టి.వి., కన్సొలేషన్ బహుమతులు: పరస్పర లాభ పథకం క్రింద కెమెరా, టూ - ఇన్ - వన్, ట్రాన్సిస్టర్, శారీస్, చేతి గడియారాలు

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

ఉదాహరణలో చూపినట్లుగా ఇన్‌లాండ్/ఎన్వలప్‌పై 9 చదరాలు తయారు చేయండి. 7 నుంచి 15 వరకు గల అంకెలను ఉపయోగించి అడ్డంగా, నిలువుగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 33 వచ్చేలా చూడాలి.
ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. 10 రోజుల్లోగా మీ ఎంట్రీలు ఆర్డినరీ మెయిల్‌ద్వారా పంపించండి. మొదట స్వీకరించిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డ్ చెయిన్ బహూకరించబడును.

**SIGMA SALES INDIA (AJSW)**
**DHALLUPURA, DELHI-110 096**